క్లుప్తంగా

పేద మహిళలకు చీరల పంపిణీ



జి.కొండూరు: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధి వెలగలేరు గ్రామానికి చెందిన ఎస్‌కే అన్వర్‌బాబు, మల్లికాబేగం దంపతులు 150 మంది పేద మహిళలకు చీరలను శుక్రవారం పంపిణీ చేశారు. అదే విధంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చాట్రాయి: మండలంలోని నర్సింహారావుపాలెం పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి శుక్రవారం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ మందపాటి రఘుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు విస్సంపల్లి సీతయ్య పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వసంత



భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలంలోని వైఎస్సార్‌కాలనీలోగల పెద్ద మసీదులో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలు శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. తొలుత ఆయన మసీదులో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఇఫ్తార్ విందును ప్రారంభించారు. అల్లాహ దయతో అందరూ సుభిక్షంగా ఉండాలనా ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్, గొల్లపూడి 10వ సెగ్మెంట్ ఎంపీటీసీ షేక్ సైదాబీ, షేక్ హిమవలి, కో ఆప్షన్ సభ్యుడు అల్తాఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వన్‌టౌన్ బ్రాహ్మణవీధి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ పరిధిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని వేదికపై స్వామి వారి కల్యాణోత్సవం చేశారు. విష్వక్సేనపూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. పుణ్యాహవచనం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, జీలకర్రబెల్లం దారణ మంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉభయదాతలు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. తిరుమంజనోత్సవ కార్యక్రమాన్ని ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు పాణింగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న భర్తపై మహిళ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. వించిపేట ఇస్మాయిల్ వీధికి చెందిన సుప్రియకు గుడివాడకు చెందిన రామారావుతో 2014లో వివాహమైంది. రామారావు రైల్వేలో ఉద్యోగం చేస్తుంటాడు. వివాహ సమయంలో భారీగా కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. పంజాసెంటర్‌లోని రైల్వే క్వార్టర్స్‌లో కాపురం పెట్టారు. సుప్రియ 186 సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీగా ఉ ద్యోగం చేస్తోంది. కొంత కాలంగా రామారావు భార్యను సరిగా పట్టించుకోకపోవడమే కాకుండా ఇతరులతో వివాహేతర సంబంధాలు అంటకడుతూ వేధింపులకు గురి చేయసాగాడు. ఇటీవల పుట్టింటికి వెళ్లి అదనపు కట్నం తీసుకురావాలని వేధించడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. భర్త వేదింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

125 మందికి కంటి పరీక్షలు

పెనమలూరు: మండలంలోని గంగూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు, సర్పంచ్ తస్లీ మున్నీసా సహకారంతో ఆయూస్ కంటి ఆస్పత్రి శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించింది. 125 మంది గ్రామస్తులకు వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 63 మందికి రూ.50 వేలతో సర్పంచి తస్లీమున్నీసా కళ్లజోళ్లు పంపిణీచేశారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి



జి.కొండూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత

ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. శుక్రవారం తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక, ఆర్థిక అసమాన తల తొలగింపునకు రాజ్యాంగంలో పొందుపరచిన రిజర్వేషన్లు ఎంతో ఉపకరిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, నడింతిరువూరు, ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్లు గజ్జల సీతారామారావు, బండి రవికుమార్, నగరపంచాయతీ కౌన్సిలర్లు, పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు.

తిరువూరు శాఖా గ్రంథాలయంలో, నగర పంచాయతీలో, మండల పరిషత్ కార్యాలయంలో, బీజే పీ, సీపీఐ కార్యాలయాల్లో, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో, ప్రభుత్వ డిగ్రీకళాశాలలో, రోలుపడి, ఎర్రమాడు, మల్లేల గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. మల్లేల గ్రా మంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా అడుగులు

జి.కొండూరు: కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, అంబేడ్కర్ ఆశయాల సాధన దిశగా అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుని జి.కొండూరు సినిమాహాలు సెంటర్లో గల అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

ఎ.కొండూరులో..

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఏ.కొండూరు, కంభంపాడు పలు గ్రామాల్లో శుక్రవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంభంపాడులో ఆయన విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా, ఎంపీటీసీ సభ్యుడు కోటా పుల్లారావు పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: బాబాసాహెబ్ అంబేడ్కర్ బడుగులకు బంధువు, నిమ్నవర్గాలకు దేవుడని జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పెదగర్ల స్వరూపరాణి పేర్కొన్నారు. గుళ్లపూడిలో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. మండలంలో శుక్రవారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వేల్పుచర్లలో తూర్పు, పడమర దళితవాడల్లో వేలాదిమందికి అన్నదానం చేశారు. కాట్రేనిపాడులో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కంబాల రాంబాబు ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

రాజ్యాంగ ఫలాలు అందరూ పొందాలి

ఇబ్రహీంపట్నం: భారత రాజ్యాంగ ఫలాలు అందరూ పొందగలిగినప్పుడే అంబేడ్కర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అని సీఐ పి.శ్రీను అన్నారు. కిలేశపురం గ్రామంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. సర్పంచ్ కాకి దేవమాత, వైస్ ఎంపీపీ బి.నాగబాలమ్మ, మండల కన్వీనర్ సాంబశివరావు, కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణనాయక్, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడు కలను స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో, రెడ్డిగూడెం ప్రధాన సెంటర్లో జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించా రు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్య క్షులు బలగాని తిరుపతిరావు, ఎస్సీ సెల్ అధ్య క్షుడు వీరమళ్ళ సుధాకర్, సర్పంచ్ మల్లాది రాణీ, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, మండల సచివా లయాల కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

విస్సన్నపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణనిధి ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం ఆదర్శం

ఆగిరిపల్లి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఎస్సై ఎస్.చంటిబాబు అన్నారు. మండలంలో అంబేడ్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అంబేడ్క చిత్రపటానికి ఎస్సై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈదరలో అంబేడ్కర్ విగ్రహానికి బీంరావ్ దళిత సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మొగదాటి జోజిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆగిరిపల్లిలో జెడ్పీ హైస్కూల్ సమీపంలో గల అంబేడ్కర్ విగ్రహానికి ఎస్‌టీయూ నాయకులు తాడి నరసింహారావు, సీహెచ్ సురేష్‌కుమార్‌లు నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బాబూరావు ఆధ్వర్యంలో, అయ్యంకి సురేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: బీఆర్ అంబేడ్కర్ సామాజిక విప్లవ సారధి అని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా జాతికోసం, జాతీయత కోసం కృషి చేశారన్నారు. నాయకులు బొంతా సాంబశివరావు, లంకే అంకమోహనరావు, దేవకుమారి, నిడుముక్కల శివశంకరరావు, చింకా శ్రీనివాసరావు, ఎన్.చిన్నయ్య, మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎన్టీటీపీఎస్ పరిపాలన భవనం, ఎస్సీఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చీఫ్ ఇంజినీర్‌లు అశోక్ కుమార్ రెడ్డి, నాగభూషణం, యూనియన్ అధ్యక్షుడు ఉమా విజయ్‌చంద్ అంబేడ్కర్‌కు నివాళ్లర్పించారు. కొండపల్లిలో డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, బసవయ్య, మూలపాడులో డీసీసీ కార్యదర్శి సీహెచ్ దాస్, ఎమ్మార్పీఎస్, ఏపీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు పుష్పాంజలి ఘటించారు.

మైలవరంలో..

మైలవరం: బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం పురస్కరించుకుని మైలవరం పాత యూనియన్ బ్యాంక్ సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మైలవరం ఎమ్మెల్యే కార్యా లయంలో అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నాయకులు, ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గంపలగూడెంలో..

తోటమూల(గంపలగూడెం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనల సాధనలకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గంపలగూడెం మండలం తోటమూల వై జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ గ్రామశాఖ నాయకులు ఇడుపులపాటి రాంబాబు, కోట లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తోటమూల ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఊటుకూరులో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఆలపాటి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

చాట్రాయిలో..

చాట్రాయి: బడుగుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను భావితరాలు కొనసాగించాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. శుక్రవారం మండలంలోని సూరంపాలెం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. విజయవాడలో నిర్మిస్తోన్న అంబేడ్కర్ విగ్రహాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్టు తెలిపారు. చనుబండ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. 1200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఎంపీటీసీ దార్ల సోనీ ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ,గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మోరంపూడి నాగేశ్వరావు, పార్టీ నాయకులు వంకిణి వెంకటేశ్వరావు, వనమా వాసు, కంచర్ల భాస్కరావు, శివ, విస్సంపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి బీఆర్ అంబేడ్కర్

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రపంచ మేధావిగా, సంఘసంస్కర్తగా, ఆర్థికవేత్తగా కీర్తిగడించిన బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌అప్పారావు అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. భారతరాజ్యాంగ నిర్మాతగా, ప్రజాస్వామ్య పరిరక్షకునిగా విఖ్యాతిపొందిన అంబేడ్కర్ బాల్యంలో అడుగడుగునా అవమానాలను, బాధలను ఎదుర్కొంటూ స్వయంకృషితో ప్రపంచ మేధావిగా ఎదిగిన గొప్ప నాయకుడని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, ఆగిరిపల్లి జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, నాయకులు షేక్ యూనిస్‌పాషా (గబ్బర్), జమలయ్య, కౌన్సిలర్లు దాసరి మారు అప్పాజీ, నవుడు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



నూజివీడులోని ఎమ్మెల్యే కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

బీజేపీ ఆధ్వర్యంలో..

స్థానిక శ్రీనివాస సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజశేఖర్, కార్యదర్శి శివరాజు వసుంధరాదేవి, పట్టణ అధ్యక్షుడు దోసపాటి జనార్ధనరావు పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో..

పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టుగాడ్యుయేషన్ కోర్సెస్‌లో శుక్రవారం ప్రిన్సిపాల్ ఆచార్య వి.వెంకట రాము అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



మైలవరంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే వసంత



సూరంపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్



కంభంపాడులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తోటమూలలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు



రెడ్డిగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత

హామీలకు మించి సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు మించి ఎన్నో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. స్థానిక ఎస్ఎఫ్సీ కార్యాలయం వెనుక వీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే శుక్రవారం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎన్ని అమలు చేసింది. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు మించి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ రాణి, గృహసారథుల మండల కన్వీనర్ శివబాజీ, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ శేషగిరి పాల్గొన్నారు.



విస్సన్నపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రక్షణనిధి

పేదల తల రాతలు మారుస్తున్న సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల తల రాతలు మారిపోతున్నాయని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మైలవరం గ్రామ సచివాలయం-5 పరిధిలోని శుద్దిపేట, సూరిబాబు పేట, బాలయోగినగర్, అయ్యప్పనగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే కాలనీల్లో ప్రతి ఇంటికీ తిరిగి కాలనీవాసులకు సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు మైలవరం పట్టణంలోని మూడు సచివాలయాల పరిధిలో సంక్షేమానికి రూ.31.99కోట్లు, అభివృద్ధి పనులకు రూ.6.55 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వసంత తెలిపారు. కాలనీవాసుల నుంచి వచ్చిన సమస్యలు పరిష్కారానికి తాజాగా రూ.60 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఇంటి యజమానుల అనుమతితో మా భవిష్యత్ నువ్వే జగన్, మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అంటించారు. స్థానిక శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

ఇంటినుంచి వెళ్లిపోయిన విద్యార్థిని

ఆమెను తిరిగి ఇంటికి చేర్చిన సామాజిక కార్యకర్త

తిరువూరు: తల్లిదండ్రులు తిట్టారని అలిగి ఇంటినుంచి వెళ్లిపోయిన ఒక విద్యార్థినిని తిరువూరుకు చెందిన సామాజిక కార్యకర్త తిరిగి ఆమె కుటుంబ సభ్యుల వద్దకు క్షేమంగా చేర్చారు. గుంటూరు జిల్లా అప్పాపురం గ్రామానికి చెందిన ఒక విద్యార్థిని డిగ్రీ చదువుతూ ఉద్యోగం ఇప్పిస్తామని కొందరు నమ్మించడంతో తల్లిదండ్రులకు తెలియకుండా ఇటీవల రూ.50వేలు చెల్లించింది. ఈ విషయం తెలిసిన తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఆమె తన స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. రెండురోజుల అనంతరం తన స్నేహితురాలి కుటుంబ సభ్యులు ఊరు వెళుతుండటంతో దిక్కుతోచక గురువారం రాత్రి తిరువూరు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. తెల్లవారుజామున ఒంటరిగా ఉన్న ఆ విద్యార్థినిని గుర్తించిన సామాజిక కార్యకర్త దుబ్బాకు ఆనందరావు ఆరా తీశారు. విద్యార్థిని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు నిరాకరించడంతో సర్దిచెప్పి ఆమె మేనత్త వద్దకు పంపే ఏర్పాటు చేశారు. ఆనందరావును పలువురు అభినందించారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

నూజివీడు: అగ్నిప్రమాదాలు నివారణకు వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు అగ్నిమాపక అధికారి కె.భాస్కరరామం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద శుక్రవారం ఆయన వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. పట్టణాల్లోని అపార్ట్‌మెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పూరిళ్లు, గోదాములు, గిడ్డంగులు, కర్మాగారాల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ప్రమాద సమయంలో నష్టం తగించుకునేందుకు చేపట్టాల్సిన పనులను ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మైలవరం అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాలు కార్యక్రమం శుక్రవారం ఎంపీడీఓ ప్రారంభించి మాట్లాడారు. ఇళ్లలో అగ్నిని పుట్టించే వస్తువులను చిన్నపిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా ఇళ్లల్లో గ్యాస్ వినియోగదారులు రెగ్యులేటర్ వద్ద గ్యాస్‌ను నిలుపుదల చేయకుండా అలా వదిలేస్తారని, అది ప్రమాదానికి కారణమవుతుందన్నారు. ప్రమాదం జరుగుతుందని ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఫైర్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు నివారించడానికి వివిధ రకాల పరికరాలు ఉంటాయని తెలిపారు.



అగ్నిమాపక వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఫైర్ ఆఫీసర్ భాస్కరరామం

కారు యజమానిపై దాడి

పెనమలూరు: కారు యజమానిపై దాడి చేసిన వారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ కిషోర్‌బాబు కథనం మేరకు.. విజయవాడ కృష్ణలంక బాలాజీనగర్‌కు చెందిన శరత్‌కుమార్ కానూరు ఆటోనగర్‌కు వ్యక్తిగత పనిపై కారులో వచ్చాడు. కారును రోడ్డుపక్కన పార్కు చేసి టింబర్ డిపోలోకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి అతని కారును లారీ ఢీకొట్టింది. ఈ విషయమై కానూరు మురళీనగర్‌కు చెందిన లారీ యజమాని ఎస్.కిషోర్‌ను కారు యజమాని శరత్‌కుమార్ నిలదీశాడు. లారీ యజమాని కిషోర్, అతని వద్ద పని చేసే సురేంద్రకుమార్, సద్దాంహుస్సేన్, సురేష్, పండు కలిసి సురేంద్రకుమార్‌పై దాడి చేశారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన కరెంట్ కష్టాలు

మైలవరం: స్థానిక న్యూ అయ్యప్పనగర్ కాలనీ వాసుల కరెంట్ కష్టాలు ఎట్టకేలకు తీరాయి. న్యూ అయ్యప్పనగర్ కాలనీలో విద్యుత్ సరఫరాకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చొరవ చూపి విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేయించారు. స్థానిక అయ్యప్పనగర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు కోసం గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వంలో 10ఎకరాలు భూమిని సేకరించారు. ఆ భూమిని విడగొట్టి లే అవుట్‌గా అభివృద్ధి చేసి, పేదలకు ప్లాట్‌లుగా విభజించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో పంపిణీలో అవక తవకలు జరగడంతో నిలిచిపోయింది. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులతో చర్చించి లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. దీంతో ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం విద్యుత్ కనెక్షన్లు కూడా రావడంతో లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



న్యూ అయ్యప్పనగర్ కాలనీకి విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

నేడు పాతశివాలయంలో విషు వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) ప్రాంగణంలో కొలువై ఉన్న అయ్యప్పస్వామి వారి ఆలయంలో ఈ నెల 15వ తేదీన విషు (కేరళ ఉగాది) వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి తెలిపారు. స్వామి దర్శనం అనంతరం గణపతి హోమంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఆలయ అర్చకస్వామి కె.మురళీధరన్‌నంబూద్రి ఆధ్వర్యంలో కేరళా సంప్రదాయ వైదిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.